వర్షాలొస్తే..రాకపోకలు బంద్

- దెబ్బతిన్న కల్వర్టుల రెయిలింగ్‌లు..
- పట్టించుకోని కూటమి సర్కార్
- ఎన్నికల హామీని విస్మరించిన వైనం
- పాలకుల తీరుపై మండిపడుతున్న ఆయా గ్రామాల ప్రజలు
- బ్రిడ్జిలను నిర్మించాలని డిమాండ్

కంచికచర్ల: మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. మరికొన్ని కల్వర్టులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో రాకపోకల సమయంలో వాహనచోదకులు అవస్థలు తప్పడం లేదు. ఆయా కల్వర్టులను అభివృద్ధి చేస్తామంటూ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చిన కూటమి పాలకులు, తీరా అధికారంలోకి వచ్చాక పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకల సమయంలో అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాహనచోదకులు, ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వర్షాకాలంలో ప్రమాదాలు...

కంచికచర్ల మండలంలోని చెవిటికల్లు, మున్నలూరు, కునికెనపాడు, మోగులూరు, వేములపల్లి, ఎస్.అమరవరం తదితర గ్రామాల పరిధిలో కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ కల్వర్టులకు ఏర్పాటు చేసిన రెయిలింగ్ కూడా పూర్తిగా ధ్వంసమైంది. వర్షాకాలంలో నీటి ఉధృతికి ఈ కల్వర్టుల వద్ద రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఐదేళ్ల క్రితం కంచికచర్ల మండలం చెవిటికల్లు లక్ష్మయ్య వాగుకు వరదనీరు చేరడంతో అధికారులు కొద్దిరోజులపాటు ప్రజల రాకపోకల కోసం నాటుపడవ ఏర్పాటు చేయగా, కృష్ణానదిలో వరద నీటి ఉధృతికి నాటుపడవ ప్రమాదానికి గురై ఓ చిన్నారి వాగులో పడి కొట్టుకుపోయి మృతిచెందిన ఘటనను స్థానికులు గుర్తుచేసుకుంటూ భయాందోళనకు గురవుతున్నారు. కంచికచర్ల సమీపంలో నల్లవాగుకు వరద ఉధృతి ధాటికి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు కొట్టుకుపోగా, కీసర కస్తవ వాగుకు మున్నేరు వరద నీటి ఉధృతికి ఓ వ్యక్తి కొట్టుకుపోయాడు. ఇలా భారీ వర్షాలు, వరదల సమయంలో ఆయా వాగుల వద్ద నీటి ఉధృతి కారణంగా ప్రజల రాకపోకలను నిలుపుదల చేస్తుండటంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది కాపలా ఉండాల్సి పరిస్థితి నెలకొంటోంది.

శిథిలావస్థలో కల్వర్టులు..చప్టాలు



రక్షణ గోడ కూడా లేని చెవిటికల్లు వద్ద ఉన్న లక్ష్మయ్య వాగు చప్టా (ఇన్‌సెట్‌లో) వరదల సమయంలో పొంగుతున్న లక్ష్మయ్యవాగు(ఫైల్)

బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి...

వర్షాకాలం వస్తే చాలు చిన్నపాటి వర్షాలకు కల్వర్టులకు వరదనీరుతోపాటు పొలాల్లో నీరు చేరి కల్వర్టులు పూర్తిగా నిండి ఉంటున్నాయి. దీంతో రాకపోకలు బంద్ అవుతున్నాయి. కల్వర్టుల స్థానంలో బ్రిడ్జిలను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతేడాది సంభవించిన వరదలకు రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోయి ఆయా గ్రామాల ప్రజలు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. వర్షాకాలం వచ్చేలోగా ఆయా కల్వర్టుల స్థానంలో బ్రిడ్జిలను నిర్మించడం ద్వారా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని టీడీపీ నాయకులు నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.



కంచికచర్ల ఫ్లైఓవర్ సమీపంలో నల్లవాగుపై ప్రమాదకరంగా మారిన రెయిలింగ్ లేని కల్వర్టు



గతేడాది వరదల సమయంలో పొంగుతున్న గండేపల్లి-కీసర మధ్య ఉన్న కస్తవ వాగు(ఫైల్)



రెయిలింగ్ కూడా లేకుండా ఉన్న కీసర-దొనబండ వెళ్లే రోడ్డులోని అడ్డదొంక వాగు కల్వర్టు

క్లుప్తంగా

నేడు ఆలయ ప్రతిష్టా మహోత్సవం

చందర్లపాడు(కంచికచర్ల): చందర్లపాడు మండలం బబ్బెళ్లపాడులో నూతనంగా నిర్మించిన ఆలయంలో అంకమ్మ అమ్మవారు, పోతురాజు, పరివారముల పాంచాహ్నిక ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా గురువారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహం, కృష్ణానది వద్ద జలాధివాసం, గ్రామ బలిహరణ, ధాన్యశయ్యాదివాసం, పుష్పాధివాసం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రికి విజయవాడ మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 11.26 గంటలకు విగ్రహ ప్రతిష్ట కళాన్యాసం, ప్రాణప్రతిష్ట, కుంభ ధేను దర్శనం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బబ్బెళ్లపాటి గోపాలకృష్ణసాయి తెలిపారు.

పాఠశాలకు క్రీడా వస్తువులు



ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): మండలంలోని ధర్మవరప్పాడుతండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పచ్చా లక్ష్మణరావు తమ పాఠశాలలోని విద్యార్థులకు తనసొంత నిధులతో గురువారం క్రీడావస్తువులను సమకూర్చారు. ఎంఈఓ-2 చిట్టిబాబు చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ లక్ష్మణరావును అభినందించారు. అకడమిక్ సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంగతాయమ్మ, టీచర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్‌లో అకాడమిక్ ఈవెంట్ ఫెర్మార్మెన్స్(విద్యా సంబంధ విషయాలపై ప్రదర్శన)లో ప్రీప్రైమరీ, ప్రైమరీ విద్యార్థుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈసందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చిన్నారుల చేత అన్ని సబ్జక్టులలో వారిలోని నైపుణ్యం, ప్రతిభ, విషయపరిజ్ఞానంపై పలు ప్రదర్శనలు చేశారు. స్కూల్ పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్‌వీ. నరసింహారావు, ఎస్.బదరీనారాయణ, ఉపాధ్యక్షుడు ఎస్‌వీవీ.సత్యనారాయణ, కోశాధికారి ఎ.జగన్నాథరావు, సభ్యులు కె.సత్యనారాయణరావు పాల్గొని చిన్నారులను అభినందించారు. ఉత్తమ ప్రదర్శన కనపరచిన చిన్నారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ-డెక్ పబ్లికేషన్స్ తరఫున ఏపీ అండ్ తెలంగాణా కోఆర్డినేటర్ అభిశాంత్, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రోత్ ప్రమోటర్ వాణి, స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కంప్యూటర్ బహూకరణ



వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అమెరికాలో నివాసం ఉంటున్న పాఠశాల పూర్వవిద్యార్థి చిరుమామిళ్ల రాంబాబు కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.జలాల్‌కు రూ.65వేలు విలువ చేసే కంప్యూటర్‌తోపాటు ప్రింటర్‌ను అందజేశారు. అదేవిధంగా మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి ఆర్థికసాయంగా రూ.5 వేలు అందించారు. ఈసందర్భంగా చిరుమామిళ్ల రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. అనంతరం దాత రాంబాబును ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.రాంబాబు, ఉపాధ్యాయులు కాకాని శ్రీనివాసరావు, సామినేని శ్రీనివాసరావు, భువనేష్, సుధాకర్, బుజ్జిబాబు, కనకమహాలక్ష్మి, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

నందిగామటౌన్(కంచికచర్ల): డిగ్రీ ఉత్తీర్ణులైన యువతకు సుజనా ఫౌండేషన్, లెరన్ నెట్ స్కిల్స్ సంయుక్తాధ్వర్యంలో పలు రకాల స్కిల్స్‌పై శిక్షణనిచ్చి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సుజనా ఫౌండేషన్ ప్రతినిధులు వీరమాచినేని కిరణ్, కొంగర దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ ఇంటర్వ్యూ స్కిల్స్, డిజిటల్ లిటరసీ, కమ్యూనికేషన్, మార్కెటింగ్ స్కిల్స్‌పై అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. డిగ్రీ అర్హత కలిగినవారు ఈ శిక్షణకు హాజరుకావచ్చన్నారు. ఆసక్తిగలవారు సెల్‌నంబరు 7382150666ను సంప్రదించాలని వారు సూచించారు.

అమ్మవారికి వెండి సూర్యప్రభ నగ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారికి గురువారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు చెందిన ఎం.మహేందర్ 900 గ్రాముల వెండితో తయారుచేసిన సూర్యప్రభ నగను బహూకరించారు. ఈ మేరకు గురువారం ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. దాత మహేందర్‌ను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

క్రీస్తు చూపిన మార్గం ఆచరణీయం



శనగపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని శనగపాడులో నిర్మించిన సీఎస్ఐ చర్చి ప్రారంభోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీస్తు చూపిన మార్గం ప్రపంచ మానవాళికి మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీల సంఘ అధ్యక్షులు మార్కపూడి గాంధీ, ఎంపీటీసీ సభ్యులు కీసర లోకేష్, సర్పంచ్ కీసర సైదులు, సొసైటీ మాజీ అధ్యక్షులు పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు జక్కులూరి దేవదాసు, గొట్రైపాటి లక్ష్మీనారాయణ, గోగుల వెంకయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చర్చి ప్రారంభోత్సవంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, జగ్గయ్యపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నాయకులు అన్నెపాగ నరసింహారావు, షేక్ సత్తార్, మాదల వీరయ్య చౌదరి పాల్గొన్నారు.

కల్యాణోత్సవ ఏర్పాట్లు పరిశీలన



వేదపండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న శుభమ్ నోఖ్వాల్, ఆర్డీవో బాలకృష్ణ, ఏసీపీ తిలక్



కల్యాణోత్సవ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్

పెనుగంచిప్రోలు: అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శ్రీతిరుపతమ్మ అమ్మవారి కల్యాణోత్సవాలను విజయవంతం చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్ ఆదేశించారు. ఈనెల 11న నిర్వహించనున్న అమ్మవారి కల్యాణం, పెద్ద తిరునాళ్ల ఉత్సవాల ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఆలయంలో ప్రసాదాల కౌంటర్లు, క్యూలైన్లు, అలాగే కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించి ఆలయ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కల్యాణం జరిగే స్థలం, మునేరు అవతల దీక్షాస్వాములకు అన్నదానం నిర్వహించే చోట భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాని ఆదేశించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, భక్తులకు తాగునీటి వసతి కల్పించే విషయంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు.

అమ్మవారిని దర్శించుకున్న అసిస్టెంట్ కలెక్టర్

తొలుత అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోఖ్వాల్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్ అసిస్టెంట్ కలెక్టర్‌ను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో నందిగామ డివిజన్ ఆర్డీఓ కె.బాలకృష్ణ, ఏసీపీ తిలక్, తహసీల్దార్ ఎ. శాంతిలక్ష్మి, ఆలయ ఈఈ రమ, జగ్గయ్యపేట సీఐ పి. వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ జి శ్రీను, ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్, ఏఈఓ ఉమాపతి, ఆలయ ఏఈ రాజు, తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కంచికచర్ల: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టాలని ఏపీఓ రమాదేవి సూచించారు. తన కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద రైతులు తమ పొలాల్లో నీటిని నిల్వ చేసుకునేందుకు నీటి గుంటలు తవ్వించుకోవచ్చని అన్నారు. పండ్ల తోటలు, పొలాల సరిహద్దు కందకాలు తీయించుకోవచ్చన్నారు. అమృత సరోవర్ కార్యక్రమంలో భాగంగా చిన్నపాటి చెరువులు తవ్వించుకోవాలని, 10 నుంచి 20 మీటర్ల పొడవు, వెడల్పుగల నీటి గుంటలు తవ్వించుకుంటే రైతులకు నీటిసదుపాయం చేకూరుతుందన్నారు. తద్వారా పంట పొలాలకు నీలి మందులు పిచికారీ సమయంలో నీటి అవసరాలు తీరడంతోపాటు కూలీలకు మంచినీటి వసతి లభిస్తుందన్నారు. పశుపోషకులు గోకులం షెడ్లను నిర్మించుకోవచ్చన్నారు. రైతులు, పశుపోషకులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10న పరిశుద్ధ మార్కు దేవాలయ పునఃప్రతిష్ట

నందిగామటౌన్(కంచికచర్ల): మండలంలోని రాఘవాపురం గ్రామంలోని పరిశుద్ధ మార్కు దేవాలయ పునః ప్రతిష్ట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు డీసరీ చైర్మన్ చాట్ల మోషే తెలిపారు. నిర్వాహకులు చాట్ల మరియమ్మతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 10న ఉదయం 10.30 గంటలకు నిర్వహించే పునః ప్రతిష్టా కార్యక్రమానికి కృష్ణాగోదావరి అధ్యక్ష ఖండం పీఠాధిపతి తంటేపూడి జార్జి కొర్నేలియస్, కృష్ణా గోదావరి అధ్యక్ష ఖండ స్త్రీల మైత్రి అధ్యక్షురాలు రెవ. దాసరి జాషువాకుమారి హాజరుకానున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేటినుంచి రామలింగేశ్వరుని కల్యాణోత్సవాలు

నందిగామటౌన్(కంచికచర్ల): పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలను శుక్రవారం నుంచి వేదోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో గంగాధర్, వంశపారంపర్య ధర్మకర్త మురళీ రాఘవకుమార్ తెలిపారు. ఆలయ ఆవరణలో గురువారం వారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు కల్యాణోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజున స్వామి వారిని పెండ్లి కుమారుని చేయడం, అమ్మవారిని బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరించటం, సామూహిక కుంకుమార్చనలు, నంది వాహన సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 8వతేదీన విఘ్నేశ్వర పూజ, వాస్తుపూజ, పుణ్యాహవచనం, అఖండ ప్రతిష్టాపన, ధ్వజారోహణ, పిల్లలు లేనివారు నంది ముద్దలు స్వీకరించుట, అమ్మవారిని లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించడం, 9నఅమ్మవారికి గజలక్ష్మీ అలంకారం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, 10న అమ్మవారికి పార్వతీదేవిగా అలంకారం, ఎదురుకోలోత్సవం తోపాటు రాత్రి 11.05 గంటలకు అమ్మవారు, స్వామి వారి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 11న అమ్మవారికి కనకదుర్గ అలంకారం, పుష్పాలంకృత విద్యుత్ దీప కాంతులతో అశేష జన సందోహంతో స్వామి వారి రథోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. 12న అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం, 13న అన్నపూర్ణాదేవి అలంకారంతోపాటు విశేష పూజలు జరుగుతాయన్నారు. 14 నుంచి 16 వరకు ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. రోజూ సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. మహోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా అలంకరించారు.



విద్యుద్దీపాలంకరణలో రామలింగేశ్వరాలయం

స్టెమి-చికిత్సతో గుండెకు భరోసా

పేట ప్రభుత్వాస్పత్రి సూపరిండింటెంట్ హరీష్

జగ్గయ్యపేటఅర్బన్: గుండెజబ్బుల మరణాలను నివారించేందుకు స్టెమిచికిత్సలు అందిస్తున్నట్లు జగ్గయ్యపేట పేట ప్రభుత్వాస్పత్రి(సీహెచ్‌సీ) సూపరిండింటెంట్ డాక్టర్ ఆళ్ల హరీష్ తెలిపారు. ఈ స్టెమిచికిత్సపై ప్రజలకు తెలియజేసేందుకు పేట ప్రభుత్వాస్పత్రిలో గురువారం 'స్టెమి-గుండెకు భరోసా' అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరీష్ మాట్లాడుతూ ఛాతిలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసంగా ఉండటం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే అప్రమత్తం కావాలన్నారు. ఈ లక్షణాలు ప్రారంభమైన మొదటి గంట లోపు పేషంట్‌ను ఆస్పత్రికి తీసుకువస్తే వారికి పరీక్షలు నిర్వహించి రూ.45వేల విలువ చేసే ఇంజక్షన్‌ను ఉచితంగా చేస్తామని వివరించారు. తద్వారా ప్రమాదం నుంచి బయటపడవచ్చన్నారు. ఎవరైనా పైలక్షణాలతో బాధపడుతుంటే వెంటనే పేట ప్రభుత్వాసుపత్రిలో సంప్రదించి, స్టెమి చికిత్స చేయించుకోవాలని ఆయన సూచించారు.



స్టెమిచికిత్స పోస్టర్లను ప్రదర్శిస్తున్న సూపరిండింటెంట్ డాక్టర్ హరీష్, వైద్యసిబ్బంది

గొయ్యిని పూడ్చించండి సారూ..

పెనుగంచిప్రోలు: గతేడాది సెప్టెంబర్‌లో సంభవించిన వరద కారణంగా స్థానిక మునేరు అవతల అమ్మవారి మామిడి తోట సమీపంలోని రోడ్డు కోతకు గురైన పెద్ద గొయ్యి ఏర్పడింది. కొద్ది రోజుల కిందట రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఈ గొయ్యిలో పడి ముచ్చింతాలకు చెందిన వాహనదారులు పడి తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 11న పెద్ద తిరునాళ్ల సమయంలో ఈ మామిడితోట ప్రాంతంలోనే సుమారు 25వేల మంది దీక్షాస్వాములకు అన్నదానం నిర్వహించనున్నారు. దీంతో జనం రద్దీ దృష్ట్యా గొయ్యి కారణంగా భక్తులు ఇబ్బందిపడే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మామిడితోట సమీపంలో ఏర్పడిన ఈ గొయ్యిని పూడ్చించాలని భక్తులు కోరుతున్నారు.



రోడ్డు మార్జిన్‌లో ఏర్పడిన గొయ్యి

ఆక్రమిత భూమి తిరిగి స్వాధీనం

నందిగామటౌన్(కంచికచర్ల): రామలింగేశ్వరస్వామి వారి ఆలయ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని ఆలయ ఈవో గంగాధర్, వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీ రాఘవకుమార్ హెచ్చరించారు. వారు గురువారం మాట్లాడుతూ పట్టణంలోని చందాపురం రోడ్డులో ఆక్రమిత భూమిని సర్వేచేసి ఆలయానికి చెందినదిగా నిర్ధారించిన ఎనిమిది సెంట్ల భూమిని ఈరోజున స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. చందాపురం బైపాస్ ఫ్లైఓవర్ వద్దనున్న సర్వే నంబరు 822లో 8.32 ఎకరాల దేవస్థాన భూమిలో ఎనిమిది సెంట్ల భూమిని ఓవ్యక్తి ఆక్రమించి ఫెన్సింగ్ వేయగా, సర్వేలో అది ఆలయానికి చెందిన భూమిగా నిర్ధారణ కావడంతో తిరిగి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వారు వివరించారు.

స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన

జగ్గయ్యపేటఅర్బన్: స్కూల్ పిల్లల బస్సులను నడిపే డ్రైవర్లు తప్పకుండా భద్రతా నియమాలను పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) ఎంవీ నారాయణరాజు సూచించారు. నిబంధనలు పాటించని డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీఏ కార్యాలయం వద్ద గురువారం జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకు చెందిన ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ పిల్లలతో బస్సులు నడిపే డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫిట్‌నెస్‌లేని బస్సుల్లో పిల్లలను తరలించరాదని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ జయచంద్ర, సురేష్, ఆయా పాఠశాలల బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవీఐ నారాయణరాజు

హెల్మెట్ ధరించాల్సిందే : సీఐ

జగ్గయ్యపేటఅర్బన్: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ పి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక బలుసుపాడు సెంటర్‌లో గురువారం ఆ ఆయన ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మార్చి నెల 1వ తేదీ నుంచి మోటారు వాహన నూతన చట్టం అమలులోకి వస్తుందని తెలిపారు. హెల్మెట్ ధరించకపోతే ప్రస్తుత చట్టం కింద విధిస్తున్న జరిమానా రూ.135కాగా, కొత్త చట్టం కింద రూ.1000 జరిమానా విధిస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.10వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పెండింగ్‌లో ఈ-చలానాలను చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది

హైవేపై లారీ బోల్తా

గంటపాటు నిలిచిన ట్రాఫిక్



గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై సిమెంట్ లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న సిమెంట్ లోడు లారీ ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సిమెంట్ బస్తాలు రోడ్డుపై పడటంతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న టోల్‌ప్లాజా సిబ్బంది జేసీబీతో లారీని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.